క్లుప్తంగా

పాదాలమ్మ తల్లి సిరిమాను ఉత్సవం



శివరాంపురంలో అమ్మవారి ఘటాలకు మొక్కుతున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: శివరాంపురంలో పాదాలమ్మ తల్లి సిరిమాను ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్యే అలజంగి జోగారావు తల్లిని దర్శించుకున్నారు. చల్లని దీవెనలు అందించాలని కోరుకున్నారు. ప్రజలందరికీ తల్లి ఆశీర్వాదం ఉండాలని, అంతా చల్లగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. సోమవారం ప్రారంభమైన ఉత్సవాల్లో రెండో రోజు మంగళవారం సిరిమాను ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఆర్.శ్రీనివాసరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ రాఘలత, జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: బలిజిపేట బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ రాఘలత, జెడ్పీటీసీ ఎ.రవికుమార్ మంగళవారం ప్రారంభించారు. వేసవి ప్రభావం ఎక్కువగా ఉండడంతో బలిజిపేట పంచాయతీ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ రాఘలత తెలిపారు. ప్రతీ శుక్రవారం మజ్జిగను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. జెడ్పీటీసీ రవికుమార్ మాట్లాడుతూ వేసవిలో బాటసారులకు, ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు ఇటువంటి చలివేంద్రాలు ఎంతో అవసరమన్నారు. కార్యదర్శి ఆదిలక్ష్మి, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్పందనకు కృతజ్ఞతలు

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లా విద్యా శాఖాధికారి డాక్టరు ఎస్‌డీవీ రమణతో పాటు ఆరుగురు ఉద్యోగుల సస్పెన్షన్ల వ్యవహారంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి మన్యం కలెక్టర్‌ను సమస్య పరిష్కరించాలని కోరుతూ ఆదేశాలు జారీ చేయడంపై ఏపీటీఎఫ్ రాష్ట్ర మహిళా కౌన్సిలర్ శ్రీదేవి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ డీఈఓ డాక్టరు రమణ ప్రభుత్వ మార్గ దర్శకాలను తూచా తప్పకుండా విధులు నిర్వహించేవారన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీకి అన్ని సంఘాలకు చెందిన ఉపాధ్యాయ సిబ్బంది తరలి రావడంతో ప్రభుత్వం కలెక్టర్‌ను చర్చలు జరిపి న్యాయబద్ధంగా పరిష్కారం చేయాలని ఆదేశించడం శుభ పరిణామమన్నారు. ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాలకు చెందిన ఉపాధ్యాయులతో పాటు మహిళా ఉపాధ్యాయులు, ఎన్‌జీఓ యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



108 అంబులెన్స్‌లో తరలిస్తున్న క్షతగాత్రులు

భామిని: మండంలోని బొడ్డగూడ దగ్గర రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో పాతపట్నం మండలం నల్లకొత్తూరుకు చెందిన పి.సురేష్, గుమ్మలక్ష్మీపురానికి చెందిన ఎస్.మహేష్ తీవ్రంగా గాయపడడంతో స్థానికుల సమాచారంతో 108 వాహనంలో భామిని పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రావాల్సిన డబ్బులు అడిగినందుకు దాడి

పార్వతీపురం: తనకు రావాల్సిన బాకీ డబ్బులు అడిగినందుకు దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. మక్కువ మండలం కొయ్యానపేట గ్రామానికి చెందిన ఎస్.లలిత కిరాణ షాపును నడిపిస్తుంది. అదే గ్రామానికి చెందిన కె.కాశి నిత్యం కిరాణా షాపులో వస్తువులు తీసుకువెళ్తుంటాడు. ఇందులో భాగంగా కాశి అరువుపై కొన్ని సరుకులను తీసుకువెళ్లారు. రావాల్సిన డబ్బులు అడిగినందుకు లలితపై దాడి చేశాడు. దీంతో ఆమెకు పలుచోట్ల గాయాలయ్యాయి. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ సారథి జగనన్న



పార్వతీపురం టౌన్: లబ్ధిదారు ఇంటికి జగనన్న స్టిక్కర్లు అతికిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు పార్టీలకతీతంగా అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. అభివృద్ధిలో కూడా ముందుకు దూసుకుపోతూ ప్రజల మన్ననలు పొందుతున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పలు చోట్ల జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మంగళవారం ప్రజా మద్దతుతో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జగనన్న స్టిక్కర్లు ప్రజలు తమ ఇళ్లకు అతికించుకొని జగనన్న పాలనకు మద్దతు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



పార్వతీపురం టౌన్: ప్రభుత్వానికి ప్రజల మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: హడ్కో కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న సచివాలయ కన్వీనర్ కిషోర్, గృహ సారథులు

అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి



మాట్లాడుతున్న సర్పంచ్ కురమాన రాధ

సీతానగరం: మండలంలోని చినబోగిలి గ్రామంలో ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఉద్యోగులు, ప్రజలు తోడ్పడాలని సర్పంచ్ కురమాన రాధ అన్నారు. సచివాలయంలో పాలకవర్గ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో మంగళవారం సమావేశం జరిగింది. సర్పంచ్ కె.రాధ మాట్లాడుతూ ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. వేసవిలో తాగునీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని కోరారు. శ్మశాన వాటికకు వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున కల్వర్టు నిర్మాణం జరిగిందన్నారు. కుళాయిలు ద్వారా నిర్దేశించిన సమయానికే తాగునీరు సరఫరా చేయడం, కాలువల్లో పూడికలుతీ తీయడం, పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యలు సచివాలయంలోనే పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహన తనిఖీలు చేపడుతున్న ఎంవీఐ శశికుమార్

పార్వతీపురం టౌన్: వాహనాల్లో ఓవర్‌లోడ్ వేసినట్లైతే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎంవీఐ శశి కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని బెలగాం ప్రధాన రహదారి వద్ద వాహనాల తనిఖీ మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు పాటించని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రతీ ఒక్కరు వాహన ధ్రువపత్రాలను వెంట ఉంచాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ఓవర్‌లోడ్ వేసినట్లైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగులో ఉన్న చలానాలను తక్షణమే చెల్లించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా వాహనదారులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే అజెండా



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని వెంకంపేట గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇంతవరకు ప్రభుత్వం వారికి చేకూర్చిన లబ్ధిని, సంక్షేమ పథకాలను తెలియపరుస్తూ వారికి ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమయానికి అందుతున్నాయా.. అని ఆరా తీశారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సీఎం జగనన్న సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాలనలో చూస్తున్నారని తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ శిద్దా జగన్నాధరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివన్నాయుడు, స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కరుణించమ్మా.. బంగారు తల్లి..



బంగారు తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: మండలంలోని పొట్లి గ్రామంలో జరుగుతున్న బంగారు తల్లి ఉత్సవాల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మంగళవారం పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా దీవించమని వేడుకున్నారు. దాదాపు 58 ఏళ్ల తర్వాత జరిగే ఈ ఉత్సవాలకు భారీ సంఖ్యలో గ్రామస్తులు బంధువులు, మిత్రులతో కలిసి పాల్గొనడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఉదయం మహిళలంతా కలిసి అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.కృష్ణారావు, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, ఎంపీటీసీ పాండ్రంకి హైమావతి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో పనివేళలు పాటించాలి



సుబద్రలో ఉపాధి పనిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ భానుమూర్తి

బలిజిపేట:

ఉపాధి పనికి హాజరయ్యే వారు పనివేళలు తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ భానుమూర్తి అన్నారు. సుబద్రలో ఉపాధి పనిని ఆయన మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. పని వద్ద మౌలిక సదుపాయాల కల్పన లేకపోవడం, పనికి ముందస్తు కొలతలు ఇవ్వకపోవడంపై క్షేత్ర స్థాయి సిబ్బందిపై ఆగ్రహించారు. పనికి వచ్చే వారికి టెంట్లు, ప్రాథమిక చికిత్సకు సంబంధించినవి సిబ్బంది ఏర్పాటు చేయాలన్నారు. పనికి వచ్చే వారికి పని కొలతలు లేకుండా పనిని అప్పగించరాదని సూచించారు. కొలతల ప్రకారం పనిని చేయాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా పని వేళలు తప్పనిసరిగా పాటించాలని వేతనదారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



అప్పయ్యపేటకు తాగునీరు సరఫరా చేస్తున్న పైపులైన్లను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదిపై ఉన్న మెగా మంచినీటి పథకం ప్రధాన పైపులైన్ మీదుగా మూడో లైన్ రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు జరుగుతున్నందున ఆరు గ్రామాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతురావు తెలిపారు. సువర్ణముఖి నదిపై ఉన్న ప్రధాన పైపులైన్‌లను ఏఈ ఆర్ పవన్ కుమార్‌తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. 2002లో సువర్ణముఖి నది నుంచి అప్పయ్యపేట, జోగింపేట, గుచ్చిమి, చిన్నారాయుడుపేట, మరిపివలస, సూరంపేట, నర్సిపురం గ్రామాలకు తాగునీరు సరఫరా చేయడనికి వీలుగా పథకాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. అప్పట్లో నర్సిపురం గ్రామానికి ప్రత్యామ్నాయంగా తాగునీరు సరఫరా చేయడంతో మిగతా ఆరు గ్రామాలకు మెగా మంచి నీటి పథకం ద్వారా నీరు సరఫరా అవుతోందన్నారు. తాజాగా రైల్వే శాఖ మూడో రైల్వే లైన్ వేయడంతో పైపులైనుల తీయాల్సి వచ్చిందన్నారు. రైల్వే అధికారులు పైపులైన్లు తొలగించడం వల్ల ఆ ఆరు గ్రామాల్లో ఉన్న బోర్లుకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి మోటార్లు అమర్చి ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయంగా తాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. రైల్వే పనులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

మలేరియా నివారణకు కృషి



సాలూరు: పట్టణంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు

సాలూరు: మలేరియా నివారణకు అందరు కృషి చేయాలని పీపీ యూనిట్ వైద్యాధికారి డా.సురేష్ చంద్రదేవ్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పట్టణం, మండలంలో ఏరియా ఆస్పత్రి, పీహెచ్‌సీల వద్ద వైద్యారోగ్య శాఖ సిబ్బంది మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో సురేష్‌చంద్రదేవ్ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, తలుపులు, కిటికీలకు వీలైనంత వరకు మెస్‌లు వేయడం తదితర దోమకాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైఎస్సార్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు ప్రియాంక, శ్రీహర్షిత, సబ్‌యూనిట్ అధికారి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉందాం


బలిజిపేట: మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా బలిజిపేట పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారిణి కిరణ్మయి, గలావల్లి పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి శ్రీనివాసల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, హెచ్‌వీ సూర్యకుమారి, ఎంపీహెచ్ ఈఓ రాధాకృష్ణ, సూపర్‌వైజర్లు రమణ, చినతల్లి, తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేట: పీహెచ్‌సీ నుంచి ర్యాలీ ప్రారంభించిన వైద్య శాఖ సిబ్బంది

అభివృద్ధిలో ఆదర్శం

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రగతిపథంలో పంచాయతీలు
- ఉత్తమ పంచాయతీలుగా వెలగవాడ, గుమ్మలక్ష్మీపురం



ఉత్తమ పంచాయతీ అవార్డు పొందిన వెలగవాడ గ్రామం

పాలకొండ రూరల్, గుమ్మలక్ష్మీపురం: పల్లెలు దేశానికి పట్టుకొమ్మలన్న నానుడిని నిజం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోంది. గ్రామ సచివాయాలు, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల చెంతకు పాలనను తీసుకువచ్చింది. అధికార యంత్రాంగం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిపై దృష్టి సారిస్తోంది. పంచాయతీలు సాధిస్తున్న ప్రగతికి అనుగుణంగా ప్రభుత్వం వాటికి అవార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. జాయతీ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గుమ్మలక్ష్మీపురం పంచాయతీ ఆరోగ్యవంతమైన పంచాయతీగా(థీమ్–2 విభాగంలో), పాలకొండ మండలం వెలగవాడ పంచాయతీ నీటి సమృద్ధి విభాగంలో జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయి.

ప్రతి ఇంటికీ కుళాయి..

మండల కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న వెలగవాడ పంచాయతీలో 2,781 మంది జనాభ, 867 ఇళ్లు ఉన్నాయి. గ్రామస్తుల తాగునీటి అవసరాలకు 20వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత నీటి పథకం ఉన్నా తాగునీటి సమస్య వేధిస్తుండేది. ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా రూ.14 లక్షలు, పంచాయతీ నిధులు రూ.11 లక్షలు ఖర్చు చేసి ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. 18 చేతిపంపు బోర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య పరిష్కారం లభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యానికి పెద్దపీట

సుమారు 3500 మంది జనాభా ఉన్న గుమ్మలక్ష్మీపురం గ్రామం స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుస్తోంది. ప్రభుత్వ నిధులతో అన్ని వీధుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతూ స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దారు.

గ్రీన్‌అంబాసిడర్లు ప్రతిరోజు ఇళ్ల నుంచి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తుండడంతో గ్రామంలో ఎక్కడా చెత్తపోగు కనిపించదు. పంచాయతీని పరిశుభ్రంగా ఉంచేందుకు సర్పంచ్ బొత్తడ గౌరీశంకరరావు, వార్డు సభ్యులు చేస్తున్న కృషికి గ్రామస్తులు, పంచాయతీ అధికారులు సహకారం తోడవ్వడంతో జిల్లాస్థాయిలో ఆరోగ్యవంతమైన పంచాయతీగా అవార్డు అందుకుంది.

నిబద్ధతకు ఫలితం

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. వీటిపై గ్రామస్తుల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. అధికారులు, గ్రామసచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమన్వయంతో స్వచ్ఛపంచయాతీగా తీర్చిదిద్దాం. మా అందరి సమష్టికృషికి ఫలితం దక్కింది.

– బొత్తాడ గౌరీశంకరరావు, సర్పంచ్, గుమ్మలక్ష్మీపురం

సమస్య తీరింది

గ్రామంలో రక్షిత పథకం ఉన్నా తాగునీటి సమస్య అధికంగా ఉండేది. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే మరింత ఇబ్బందులు ఉండేవి. నీటికోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. ప్రతీ ఇంటికీ కుళాయి వేశారు. పుష్కలంగా నీరు అందుతోంది. చాలా సంతోషంగా ఉంది.

– ఎల్.దుర్గమ్మ, వెలగవాడ పంచాయతీ, పాలకొండ మండలం



గుమ్మలక్ష్మీపురంలో పారిశుద్ధ్య పనుల్లో గ్రీన్ అంబాసిడర్లు

కార్మికులకు న్యాయం చేయాలి



ఆందోళన చేస్తున్న నాయకులు, సభ్యులు

సాలూరు: చింత పండు పిక్క తీస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని చింత పండు పిక్కతీత కార్మిక సంక్షేమ సంఘం నాయకుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. పట్టణంలో సుమారు 250 మంది మహిళలు చింతపండు పిక్కతీత పనులతో ఉపాధి పొందుతున్నారని అన్నారు. చింతపిక్క తీత కోసం కార్మికులు, చింతపండు వర్తకులతో ప్రతి 3 సంవత్సరాలకు కూలిని ఒప్పందం చేసుకుంటున్నారని తెలిపారు. పాత ఒప్పందం 2023 మార్చి నెలతో ముగిసిందని, ప్రస్తుత ధరలకు తగ్గట్టుగా కేజీ చింతపిక్క తీతకు రూ.19 నుండి 24లకు పెంచాలన్నారు. దీనిపై చింతపండు వర్తకులు సరిగ్గా స్పందించడం లేదన్నారు. వెంటనే అధికారులు చొరవ తీసుకుని సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

నేడు ‘గడప గడపకు మన ప్రభుత్వం’

సాలూరు: మండలంలోని తుండ సచివాలయ పరిధిలో ఇటికవలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పార్వతి మంగళవారం తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పాల్గొనే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.